RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శుక్రవారం | 16 -02 - 2024

సంపుటి: 1 | సంచిక : 271 | పేజీలు : 4 | వెల : 5/-



## కల్యాణం.. కమనీయం!

### ఆర్థిక వ్యవస్థకు కల్యాణమస్తు'

- పెళ్లిళ్ల సీజన్‌గా గుర్తింపు పొందిన మాఘమాసం
- ఈ సారి దేశవ్యాప్తంగా 42లక్షల ముహూర్తాలు
- వీటితోపాటు నూతన గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు
- కోట్లలో జరగనున్న వ్యాపార లావాదేవీలు
- లక్ష్మీకళ సంతరించు కోనున్న ఆర్థిక వ్యవస్థ

**ముంబై, ప్రభాతసూర్యుడు :** ఇది మాఘమాసం. ఈ మాసంలో బలమైన ముహూర్తాలు ఉంటాయని, మరే నెలలోనూ ఇంతటి అద్భుత ఘడియలు ఉండవని బ్రాహ్మణ పండితులు చెబుతుంటారు. అందుకే వివాహాలు, గృహప్రవేశాలు సహా చాలా శుభ కార్యాలను మాఘ మాసంలో జరిపిస్తుంటారు. మన దేశంలో, పెళ్లిళ్ల సీజన్‌కు

మిగతా 3వ పేజీలో...

## విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

2లో




## చందాలకు సుప్రీం చెక్!

- రాజకీయ పార్టీల విరాళాలపై సంచలన తీర్పు
- ఎలక్టోరల్ బాండ్లు చెల్లుబాటు కావని వెల్లడి
- రాజ్యాంగ విరుద్ధమన్న సంస్వోన్నత న్యాయస్థానం
- సహ చట్టానికి విఘాతమన్న సుప్రీం ధర్మాసనం
- విరాళం క్విడ్ ప్రోకోకు దారితీస్తుందని అభిప్రాయం
- బాండ్ల పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశం

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** ఎలక్టోరల్ బాండ్ల చెల్లుబాటుపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అని తేల్చి చెప్పింది. ఆర్టికల్ 19(1)(ఏ)తో పాటు సమాచార హక్కు చట్టానికి ఇవి విఘాతం కల్గిస్తున్నాయని స్పష్టం చేసింది. ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఏకగ్రీవ తీర్పునిచ్చింది. నల్లధనం నిర్మూలనకు ఎలక్టోరల్ బాండ్స్ ఒక్కటే మార్గం కాదని వెల్లడించింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం క్విడ్ ప్రోకోకి దారి తీస్తుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. ఇది కచ్చితంగా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని స్పష్టం చేసింది. ఎలక్టోరల్ బాండ్‌లను

మిగతా 3వ పేజీలో...




## ఎందుకు రాలే..?

- అసెంబ్లీకి కేసీఆర్ గైర్హాజర్‌పై సర్వత్రా చర్చ
- కథకథలుగా కారణాలపై ప్రచారం
- ఈసారి కాకపోతే ఇంకోసారి అంటున్న గులాబీ శ్రేణులు
- తప్పక రావాల్సిందే అంటున్న అధికార పార్టీ
- గులాబీ బాస్ అంతర్మథనంపై ఊహాగానాలెన్నో?



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్‌ను ధీటుగా ఎదుర్కొన్నామని వచ్చే సమావేశాల నుంచి టైగర్ వస్తుందని కాంగ్రెస్ పరిస్థితి తేలిపోతుందని కేటీఆర్ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షల సందర్భంగా దాదాపుగా ప్రతీ రోజూ ప్రకటనలు చేశారు. ఈ ప్రకటనలను చూసిన వారంతా కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావడం ఖాయమనుకున్నారు. కానీ కేసీఆర్ రావడం లేదు. ఒక రోజు వచ్చేస్తున్నారని మీడియాకు సమాచారం ఇచ్చారు. కానీ రాలేదు. మధ్యలో నల్లగొండ సభకు హాజరు కావడంతో అనారోగ్యం కారణాన్నీ చెప్పే పరిస్థితి లేదు. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ పదే పదే కార్నర్ చేస్తోంది. ఎవరు మాట్లాడినా విలువ లేదని ప్రతిపక్ష నేత రావాల్సిందేనని డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీకి రాని వ్యక్తికి ప్రజలు ఎందుకు ఓట్లేస్తారని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఇంత తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్నా కేసీఆర్ మాత్రం సభకు హాజరు కావడం లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. అధికారానికి దూరమైంది. ఆ తర్వాత కేసీఆర్ నగర సమీపంలోని ఎర్రవెల్లిలోని తన ఫార్మ్ హౌస్ లో బాత్రూమ్ కి వెళుతూ జారిపడ్డారు. హైదరాబాద్ సోమాజీగూడ ఆస్పత్రిలో తుంటికి ఆపరేషన్ చేయించుకున్నారు. హైదరాబాద్ నందీనగర్ లోని తన ఇంట్లో ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకుని మళ్లీ ఫాం హౌస్ చేరుకున్నారు. పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. నల్లగొండ సభకు హాజరయ్యారు. అయినా ఆయన మాత్రం అసెంబ్లీకి హాజరు కావడం లేదు. కేసీఆర్ సభకు హాజరు కాని అంశాన్ని కాంగ్రెస్ అడ్వాంటేజ్ గా తీసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ

మిగతా 4వ పేజీలో...

## నంబర్ 2 హరీశ్..!



- బీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత హరీశ్‌రావేనా..?
- చెవులు కొరుక్కుంటున్న గులాబీ శ్రేణులు
- ఇప్పటికే పార్టీలో ట్రబుల్ షూటర్‌గా తన్నీరు
- తాజా పరిణామాలతో మరోమారు తెరపైకి
- క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడంలో కేటీఆర్ విఫలం?
- హరీశ్‌రావే సమర్థుడంటున్న ఓ వర్గం నాయకులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ ఎస్ మధ్య వాటర్ వార్ తారాస్థాయికి చేరింది. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు, లొసుగులపై దృష్టిసారించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు, విమర్శలు చేసిన రేవంత్.. అధికారంలోకి రాగానే ఆ అవినీతిని వెలికితీయడంపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలో ఒక్కోఅడుగు ముందుకు వేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో

మిగతా 4వ పేజీలో...

## పాతవి నాలుగు, కొత్తవి ఐదు!

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ పార్లమెంటు ఎన్నికలను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది అసెంబ్లీ స్థానాలను సాధించిన కమలం పార్టీ అదే సంఖ్యను టార్గెట్ గా పెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించింది. గత ఎన్నికల్లో నాలుగు పార్లమెంటు స్థానాలను బీజేపీ గెలుచుకుంది. సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గాల్లో కమలం పార్టీ గత ఎన్నికల్లో విజయం సాధించింది. ఇప్పుడు ఆ స్థానాలతో పాటు మరో నాలుగు నుంచి ఐదు అంటే ఎనిమిది నుంచి తొమ్మిదిస్థానాలను

మిగతా 2వ పేజీలో...



## 12 మంది.. ఒక్క చాన్స్ ప్లీజ్

**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :** రాజకీయ అనుభవజ్ఞులతో పాటు అసలు రాజకీయం తెలియని వ్యక్తులు సైతం కాంగ్రెస్ ఎంపీ టిక్కెట్ కోసం అర్రులు చాస్తున్నారు. ఇప్పటికే అధిష్టానం వద్ద దరఖాస్తుల గడువు ముగిసే నాటికి ఖమ్మం స్థానం నుంచి పోటీచేసేందుకు 12 మంది ఆశావహులు "ఒక్క చాన్స్ ప్లీజ్.." అంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం నుంచి గతంలో పోటీ చేసి కేంద్ర మంత్రి పదవిని అలంకరించిన మాజీ మంత్రి రేణుకా చౌదరి, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ తో పాటు అసలు రాజకీయఅనుభవమే లేని బడా వ్యాపార వేత్త వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో సీనియర్ నేత వి.హనుమంతరావు సైతం ఖమ్మం పార్లమెంట్ కు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ డైరెక్టర్ గా పని చేసిన మాజీ అధికారి గడల శ్రీనివాసరావు కూడా ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేశారు. ఈయన మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం స్థానం నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపి ఒక దశలో కేసీఆర్ కాళ్ళు మొక్కేందుకు సైతం

మిగతా 4వ పేజీలో...





## కట్టె కాలేవరకు దోచుకుంటడు

### కేసీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు

**సిరిసిల్ల, ప్రభాతసూర్యుడు :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కమార్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అయోధ్య రామ మందిరాన్ని వ్యతిరేకించినోళ్లను, అయోధ్య అక్షింతలపై రాజకీయం చేసేటోళ్లను బహిష్కరించండి. కేటీఆర్ అసలు పేరు అజయ్ రావు... టిక్కెట్ కోసం ఎన్టీఆర్ వద్దకు పోయి కేటీఆర్ అని మార్చిండు. కట్టె కాలేవరకు కేసీఆర్ తెలంగాణను దోచుకుంటూనే ఉంటారు. కేసీఆర్ వన్నీ కొంపలు ముంచే ఆలోచనలే నని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేదు. ఎన్నికల కోడ్ సాకుతో హామీలను అమలు చేయకుండా దాటవేసే కుట్ర. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే. అవగాహనతోనే ఒకరిపై ఒకరు తిట్టుకుంటున్నారు. క్రిష్ణా, కాళేశ్వరంపై విచారణ జరపాలి. దోషులను జైలుకు పంపాలి. కేటీఆర్ బతుకేందో నాకు తెలుసు.. ముడతల చొక్కా, రబ్బర్ చెప్పులేసుకుని తిరిగేటోడు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్లు సంపాదించిండు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులిచ్చింది. సిరిసిల్ల జిల్లాకు కేవలం 7 పథకాల కోసమే రూ.1408 కోట్లకుపైగా నిధులిచ్చింది. ఈ జిల్లాలో మొక్కల పెంపకం కోసమే రూ.266 కోట్లకుపైగా నిధులిచ్చింది. మరి ఆ నిధులన్నీ ఏమైపోయినయ్.. ఒక్క మొక్క కూడా కన్పిస్తలేదని అన్నారు. పైసలిచ్చేది మోదీ... మీ కోసం కొట్లాడేది బీజేపీ... కానీ కాంగ్రెస్ కు ఓటేయడం ఎంత వరకు న్యాయం? బీఆర్ఎస్ గుడిని మింగితే... కాంగ్రెస్ గుడిలోని లింగాన్ని సైతం మింగేసే బాపతని అన్నారు. మీరు ఎంపీగా గెలిపిస్తే 150 రోజులు 1650 కి.మీల పాదయాత్ర చేసినా. మీకోసం నిరంతరం పోరాడిన.. నాపై 100కుపైగా కేసులు పెట్టినా భయపడలేదు. కేటీఆర్ కు కండ కావరం తలకెక్కి మాట్లాడుతున్నడు. అయ్య పేరు చెప్పుకుని బతుకుతున్నడు. నేను మా తాత, తండ్రి పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి రాలేదు. కార్యకర్తగా మొదలై ప్రజల కోసం కొట్లాడి ఎంపీ అయ్యాను. కాంగ్రెస్ పార్టీ భస్మాసుర హస్తమే. జేపీకి ఓటేసి మోదీని మళ్లీ ప్రధానిని చేద్దామని అన్నారు.



## ఆపరేషన్ ఆకర్ష్‌కు గ్రీన్ సిగ్నల్...



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ కాంగ్రెస్ గేట్లెత్తిందా? ఆపరేషన్ ఆకర్ష్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందా? అంటే.. అవుననే అంటున్నాయి జరుగుతున్న పరిణామాలు. వివిధ కారణాలతో బయటకు వెళ్లిపోయిన పాత నాయకులను తిరిగిరప్పించడంపై అధి నాయకత్వం సీరియస్‌గా దృష్టిపెట్టినట్టు చెబుతున్నాయి పార్టీ వర్గాలు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు.. రాజకీయ ప్రత్యర్థులపై పంజా గట్టిగానే విసరాలని సీఎం డిసైడైనట్టు ప్రచారం జరుగుతోంది. దాని చుట్టూనే ఇప్పుడు పార్టీలో చర్చ జరుగుతోంది. ఢిల్లీ టూర్‌లో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతకు పార్టీ ప్రధాన కారుదర్శి కేసీ వేణుగోపాల్ తో కండువా కప్పించారు సీఎం రేవంత్‌రెడ్డి. అదే సమయంలో మన్నే జీవన్ రెడ్డికూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

4లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి




**మేడ్చల్ - ప్రభాతసూర్యుడు :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ లోని శివారెడ్డిగూడ చౌరస్తా వద్ద బైక్ ని కారు ఢీ కొనడంతో రాంపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్(32), శ్రీకాంత్(26) అనే ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. దాంట్లో ప్రశాంత్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘట్కేసర్ నుండి రాంపల్లి కి బైక్ పై ప్రయాణిస్తుండగా బుధవారం రాత్రి సంఘటన జరిగింది. స్థానికులు 108 కు సమాచారం అందించడంతో, సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది, గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్(32), శ్రీకాంత్(26) అనే ఇద్దరు యువకులలో ప్రశాంత్ కడుపు భాగంలో పెద్ద గాయం జరిగి ప్రేగులు బయటకు రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘట్కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు
- డిడిఎల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రేరణ సదస్సు
- ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి శరత్ బాబు



**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :** విద్యార్థులు ఒత్తిడిలకు లోను కాకుండా ఆత్మ స్థైర్యముతో ముందుకు కొనసాగాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు. డిడిఎల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రేరణ 2024 అవగాహన సదస్సు కార్యక్రమాన్ని పెద్ద అంబర్ పేట్ కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. మండల పరిధిలోని 20 ప్రభుత్వ పాఠశాలల 1200 మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్న ప్రేరణ 2024 అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంప నాగేశ్వరరావు విద్యార్థులతో ప్రసంగిస్తూ.. విద్యార్థి దశ నుండే విద్యార్థులు ఏ విధంగా మసలుకోవాలో, సమాజంలో ఉన్నత స్థానాలకు ఎలా ఎదగాలో సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిలకు గురవకుండా ఉండేలా పలు అంశాలను బోధించారు. విద్యార్థులకు స్ఫూర్తిని నింపుతూ, నూతన ఉత్సాహాన్ని కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు పట్ల ఎన్ని కష్టాలు పడతారో, విద్యార్థులకున్న తమలోని శక్తి సామర్థ్యాలను గుర్తు చేశారు. ఈ సందర్భంలో పలువురు విద్యార్థులు భావోద్వానికి లోనై కంటతడి పెట్టారు. అనంతరం ఈ అవగాహన సదస్సు కార్యక్రమానికి హాజరైన ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మోడల్ ప్రశ్నావళి పుస్తకాలను (టీచర్స్ హ్యాండ్ బుక్) అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు హీర్య నాయక్, వెంకట్ రెడ్డి, కవాడి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ రెడ్డి, ఈ శ్రీనివాస్, ప్రవీణ్, డిడిఎల్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ కిషోర్, సెక్రెటరీ రామ్ రాజ్, ట్రెజరర్ శ్రీధర్, సుశీల్, సంతోష్, శాంతానంద ప్రసాద్, అభిరామ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల జ్ఞానజ్యోతి సంత్ సేవాలాల్

### మాజీ సర్పంచ్ రాజునాయక్



**యాచారం - ప్రభాత సూర్యుడు :** గిరిజన బిడ్డల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ గిరిజనుల జీవితాలను ప్రభావితం చేసి వారి జీవితాలలో జ్ఞాన జ్యోతి వెలిగించిన గొప్ప మహనీయుడు సేవాలాల్ సంత్ మహారాజ్ అని అన్నారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బాల్యంనుండె వైద్య, చింతన, ఇతరుల పట్ల దయాగుణం జాలి గుణం చూపేవారు. బ్రిటిష్ పాలకుల సమయంలో కొండల ప్రక్కన తండాలలో జీవిస్తూ మందు గుండు ఆయుధ సామగ్రిని అందించే సంచార జీవులుగా ఉన్న లంబాడీలను ఒక్క తాటిపైకి తెచ్చిన గురువు సేవాలాల్ మహారాజ్. ఆ యొక్క జాతుల సంస్కృతిని కాపాడడం కోసం కృషి చేశారు. విద్య, వైద్యంతో పాటు కొత్త జీవితాన్ని ప్రసాదించిన సేవాలాల్ మహారాజ్. గిరిజనులకు తండాల రూపంలో స్థిర నివాసం అలవాటు చేసింది సేవాలాల్ మాత్రమే అని అన్నారు. గిరిజనులకు వ్యవసాయం మీద అవగాహన కల్పించాడు. పశుపోషణ, ప్రకృతి పట్ల ఆరాధన భావాలను వారిలో నింపారు. కబీర్, రవి దాస్, జ్యోతిరావు పూలే మహనీయుల వలె గిరిజనుల్లో జ్ఞాన జ్యోతి వెలిగించిన గౌరవం సేవలాల్ మహారాజ్ కి దక్కిందని కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో గిరిజన బిడ్డలు అభివృద్ధిలో మరింత పురోగమించాలని కోరారు.

## ఇల్లు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటాం

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డబల్ బెడ్ రూమ్ సముదాయం దగ్గర లబ్దీదారులు అందోళనకు దిగారు. ఇల్లు ఇవ్వకపోతే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడతామని మహిళలు అంటున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట ఇచ్చి మాట తప్పారని అన్నారు. ఎమ్మెల్యే అనుచరులకు అనుకూలంగా ఉన్న వాళ్లకే ఇచ్చుకున్నారంటూ కమలానగర్ బస్తి మహిళలు ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పుడు ఎమ్మెల్యే రాకపోతే ఆత్మహత్యకు పాల్పడతామని అన్నారు.



## కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి 'వరికుప్పల'కు సన్మానం

**యాచారం - ప్రభాత సూర్యుడు :** కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా వరికుప్పల సుధాకర్ ఇటీవల నియమితులవ్వడం తో యాచారం మండలం,మల్కీజ్‌గూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రోజు ఆయనను ఘనంగా సన్మానించారు.గ్రామ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేరంగుల పాండు, ప్రధాన కార్యదర్శి వరికుప్పల అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సన్మానించి,శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వరికుప్పల సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికీ పదవులు వస్తాయని, పార్టీకి క్రమశిక్షణతో ఉండాలని, అంకితభావంతో పనిచేయాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమాలు, పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసారు. కార్యక్రమంలో జి.ప్రవీణ్ రెడ్డి, బోడ మధు, ఏ.జీవన్, వి.వెంకటేష్, వి.శ్రీనివాస్, వి.(బ్రహ్మం) యాదయ్య, వి.జి.నందీశ్వర్, వి.ఈదయ్య, డి.నారయ్య, వి.శంకరయ్య, డి.స్వామి, లింగారెడ్డి, చీర మహేష్, వి.వంశీ, వి.సురేష్, వి.అజయ్, వి.మీట్టు, వి.రాజ్‌కుమార్, వి.వెంకట్, నందు, పవన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.




## ఇబ్రహీంపట్నం డిపోలో ప్రగతి రథచక్ర పురస్కారాలు

- డిప్యూటీ ఆర్ఎం జి.జగన్
- మేడారం జాతర స్పెషల్ ఆపరేషన్లు విజయవంతం చేయాలి
- కేఎంపిఎల్ అవార్డు గ్రహీత డ్రైవర్లకు అభినందనలు

**ఇబ్రహీంపట్నం- ప్రభాత సూర్యుడు :** గురువారం ఇబ్రహీంపట్నం డిపోలో జనవరి మాసం ప్రగతి రథ చక్ర పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ ఆర్ఎం జి.జగన్ హాజరయ్యా రు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఎక్కువ ఏపీకే తెచ్చిన కండక్టర్లను ఎక్కువ కేఎం పిఎల్ తెచ్చిన డ్రైవర్లను, అవార్డు గ్రహీతలను అభినందించారు. మిగతా ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకోవాల్సిందిగా కోరారు. 19వ తేదీ నుండి మేడారం జాతర స్పెషల్ ఆపరేషన్‌ను విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. తదుపరి మేడారం వెళ్లే బస్సుల కండిషన్‌ను పరిశీలించారు. కార్య క్రమంలో డిఎం బి.వెంకట నర్సప్ప, ఏఎంటి జి.సరస్వతి, ఏఈఎం యం.సత్తయ్య , సూపర్వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.


## పాతవి నాలుగు, కొత్తవి ఐదు!

మొదటిపేజీ తరువాయి..

గెలుచుకుని పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచుకోవాలని వ్యూహరచనలు చేస్తుంది. వరంగల్, మహబూబ్‌నగర్,పెద్దపల్లి, మల్కాజ్‌గిరి, మహబూబాబాద్ స్థానాలపై కన్నేసింది. ఈ స్థానాల్లో గట్టి అభ్యర్థులను రంగంలోకి దించి ఎలాగైనా గెలుచుకునే దిశగా కమలం పార్టీ వ్యూహాలను రచిస్తుంది. ఈ పార్లమెంటు నియోజకవర్గాలపరిధిలో ఇప్పటికే బీజేపీ సర్వేలు చేయించినట్లు తెలిసింది. ఆదివాసీలు, మాదిగ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జెండా ఎగరవేయాలన్న లక్ష్యంతో బీజేపీ నేతలున్నారు. అక్కడ తమకు సానుకూలవాతావరణం ఉందని గుర్తించిన పార్టీ అధినాయకత్వం అక్కడ పోటీ కోసం అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలు దఫాలుగా సర్వేలు నిర్వహించిన బీజేపీ త్వరలోనే అభ్యర్థులను ప్రకటించిప్రచారంలోకి పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది. దక్షిణ భారత దేశంలో తెలంగాణలోనే కొంత అనుకూలమైన వాతావరణం కమలం పార్టీకి ఉంది. కర్ణాటక తర్వాత తెలంగాణలోనే ఎక్కువ స్థానాలను గెలుచుకునే హోప్స్‌ఉన్నాయి. అందుకే ఇక్కడ ఎక్కువగా ఫోకస్ చేయాలని భావిస్తుంది. అగ్రనేతలందరినీ పంపి ప్రచారాన్ని ఉధృతం చేయాలని నిశ్చయించింది. ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఎక్కువ సంఖ్యలో సభలో పాల్గొనేలా ప్లాన్ చేసింది. బహిరంగ సభలతో పాటు రోడ్‌షోలను కూడా నిర్వహించేందుకు రెడీ అయింది. ప్రచారం కోసం ప్రత్యేకంగా ప్లాన్ ను రూపొందించాలని కేంద్ర నాయకత్వం నుంచి రాష్ట్ర పార్టీకిఆదేశాలు అందినట్లు తెలిసింది. ఇతర పార్టీల నుంచి... కొన్ని నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులు దొరకకపోతే ఇతర పార్టీల నుంచి లీడర్లను తీసుకోవాలని కూడా ఆ పార్టీ భావిస్తుంది. తెలంగాణలో ఎనిమిది నుంచితొమ్మిది స్థానాలను గెలుచుకునే లక్ష్యంతో పనిచేయాలని ఇప్పటికే ముఖ్యనేతలకు పార్టీ కేంద్ర నాయకత్వం సూచించిందని సమాచారం.

## సిపిఐ ఆధ్వర్యంలో ధర్మబిక్షం జయంతి

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాతసూర్యుడు :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో బొమ్మగాని ధర్మ బిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది, జాతీయ గీత పనివాళ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముత్యాల యాదిరెడ్డిలు ప్రసంగిస్తూ బొమ్మగని ధర్మ బిక్షం సేవలను గుర్తు చేశారు. విభిన్న నాయకత్వ లక్షణాలు, పోరాట పటిమ కలిగిన, అరుదైన నాయకుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మాభిక్షం అని, వందేమాతర పిలుపుతో దేశ స్వాతంత్ర సంగ్రామంలో, ఆంధ్ర మహాసభ సంస్థలో సభ్యుడిగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట మహాసంగ్రామంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ మట్టి మనుషుల వెట్టి చాకిరి విముక్తి కోసం అహర్నిశలు శ్రమించి జైలు జీవితం అనుభవించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలలోని వృత్తి సంఘాలను ఏర్పాటు చేసి ఎట్టి మనసులను తట్టి లేపిన విలక్షణ నాయకుడని, ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజా సంక్షేమం చేసిన గొప్ప ప్రజా సేవకుడని, రాచకొండ ప్రాంతంలో భూ పోరాటాలు నిర్వహించి వేలాది మందికి భూమిని పంచిన నిజమైన నిస్వార్థమైన కమ్యూనిస్టు ఆదర్శప్రాయుడని ఆ మహా నాయకుని సేవలు గుర్తు చేసుకుంటూ ఆయన నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన రూపం, సేవలు నేటి



కమ్యూనిస్టులకే కాకుండా ప్రజా ప్రతినిధులకు ఆచరణీయమైన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కౌన్సిలర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, ఏఐటీసీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరి సింగ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ తొర్పునూరి ప్రవీణ్ గౌడ్, జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి దిగోజు వేణుగోపాల్, మండల నాయకులు కేతరాజు నరసింహ, పొన్నాల యాదగిరి, దాసరి ప్రసాద్, వట్టి నవనీత నారాయణ రెడ్డి, దాదిమల్ల నారాయణ, వెంకన్న, పుల్లయ్య, చందన, నాగవల్లి యాదగిరి నిరంజన్, పగడాల మహేందర్, దేవమ్మ, మధు, వినోద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# కల్యాణం.. కమనీయం!

**మొదటిపేజీ తరువాయి..**

ప్రారంభంగా మాఘ మాసాన్ని గుర్తిస్తారు. ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా లక్షలాది వివాహాలు జరుగుతాయని, దేశ ఆర్థిక వ్యవస్థ లక్షల కోట్ల బూస్టర్ డోస్ లభించొచ్చంటూ 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ లెక్కగట్టింది. అంమి పరిశోధన విభాగం దేశవ్యాప్తంగా 30 నగరాలకు చెందిన వ్యాపారులు, సర్వీస్ ప్రొవైడర్లతో మాట్లాడి, ఒక రిపోర్ట్‌ను విడుదల చేసింది.'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ డేటా' ప్రకారం.. 2024 జనవరి 15 నుంచి 2024 జులై 15 వరకు ఉన్న వెడ్డింగ్ సీజన్‌లో (ఆరు నెలల కాలం) దేశవ్యాప్తంగా 42 లక్షల వివాహాలు జరుగుతాయి. ఈ కాలంలో వివాహ సంబంధిత కొనుగోళ్లు & సేవల వినియోగం ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ. 5.5 లక్షల కోట్ల ఆదాయం సమకూరుతుంది. పెళ్లి ఖర్చుల రూపంలో దేశవ్యాప్తంగా మార్కెట్లలోకి భారీగా నగదు ప్రవాహం మొదలవుతుంది. ఈ పెళ్లిళ్ల సీజన్‌లో, దేశ రాజధాని ఢిల్లీలోనే 4 లక్షలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని, దీని వల్ల దాదాపు రూ. 1.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంమి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ చెప్పారు. గత ఏడాదిలో, 2023 డిసెంబర్ 14న ముగిసిన పెళ్లిళ్ల సీజన్‌లో దాదాపు 35 లక్షల వివాహాలు జరగ్గా, దాదాపు రూ. 4.25 లక్షల కోట్ల వ్యాపారం జరిగింది. అంమి ప్రకారం, ఈ సీజన్‌లో పెళ్లిళ్ల ఖర్చులు ఇలా ఉండొచ్చు...

– దాదాపు 5 లక్షల పెళ్లిళ్లలో, ఒక్కో వివాహానికి రూ. 3 లక్షల వరకు ఖర్చు చేస్తారని అంచనా.
– దాదాపు 10 లక్షల వివాహాల్లో, ఒక్కో శుభకార్యానికి రూ. 3 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా.
– దాదాపు 10 లక్షల వెడ్డింగ్స్‌లో, ఒక్కో వెడ్డింగ్‌కు రూ. 6 లక్షల నుంచి రూ. 10 లక్షలు వ్యయం చేస్తారని లెక్కగట్టారు.
– దాదాపు 10 లక్షల పెళ్లిళ్లలో, ఒక్కో పెళ్లికి రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షలు ఖర్చవుతుంది.
– దాదాపు 6 లక్షల వివాహాల్లో, ఒక్కో వివాహానికి రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలు వ్యయం అవుతుందని అంచనా.
– దాదాపు 60 వేల వెడ్డింగ్స్‌లో, ఒక్కో వెడ్డింగ్‌కు రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షలు ఖర్చు చేస్తారని లెక్కించారు.
– దాదాపు 40 వేల పెళ్లిళ్లలో ఒక్కో పెళ్లికి రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయలకు పైగా వ్యయం అవుతుందని అంచనా.

ఇవన్నీ కలిపితే, ఈ ఆరు నెలల్లో, దాదాపు 42 లక్షల పెళ్లిళ్లలో వివాహ సంబంధిత కొనుగోళ్లు, సేవల ద్వారా రూ. 5.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. పెళ్లి ఖర్చు అంటే కేవలం వివాహం, భోజనాలకు అయ్యే వ్యయం మాత్రమే కాదు, ఇంకా చాలా ఉన్నాయి. పెళ్లికి ముందు ఇంటికి రిపేర్లు చేయించడం, రంగులు వేయించడం వంటివి చేస్తారు. కాబట్టి, ఆ రంగంలో వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ఇంకా.. ఆభరణాలు, కొత్త బట్టలు, పాదరక్షలు, ఫర్నీచర్, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, పండ్లు, పూజ సామగ్రి, కిరాణా, తృణధాన్యాలు, గృహోపకరణాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, బహుమతులు వంటి వాటికి డిమాండ్ పెరుగుతుంది. తద్వారా ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా వ్యాపారం భారీ స్థాయిసో నడుస్తుంది. మొత్తంగా చూస్తే.. పెళ్లిళ్ల సీజన్ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది, ప్రజలకు పెద్ద సంఖ్యలో ఉపాధి కూడా లభిస్తుంది.

# బీజేపీ మహిళా మోర్చా ఆందోళన

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేత షాజహాన్ షేక్, అతని అనుచరుల చేతిలో లైంగిక వేధింపులు, చిత్ర హింసలకు గురైన మహిళలకు మద్దతుగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు బిజెపి మహిళ మోర్చా ఆందోళనకు దిగింది. అతనిపై చర్యలు తీసుకోవాలని అతన్ని వెంటనే అరెస్టు చేయాలని మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్ప రెడ్డి డిమాండ్ చేసారు. సందేశ్ఖాలీ ప్రాంతంలో షాజహాన్ షేక్ అన్యాయాలు, లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా.. స్థానిక గిరిజనుల భూముల్ని స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో మహిళ ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ మహిళలకు న్యాయం జరగడం లేదు. మమత బెనర్జీ ఇప్పటివరకు ఈ అంశంపై మాట్లాడకపోవడం దారుణం.

# అప్పు తీర్చలేదని కడతేర్చారు

**రంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :**
ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో దారుణం చోటుచేసుకుంది. ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వలేదనీ తన భర్త వెంకట్ నీ ఈ రోజు మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు వచ్చి బిల్డింగ్ పైకి తీసుకెళ్లి కొట్టి తన భర్తను 3 వ అంతస్తు నుండి తోసేయడం తో మృతి చెందాడని బార్య అనిత ఆరోపిస్తుంది. మధ్యాహ్నం నుండి 2 గంటల పాటు హింసించడం జరిగిందని అడ్డుకోవడానికి వెళ్తే నన్ను కూడా తోసేశారునిమృతిని బార్య అనిత అవేదనం వ్యక్తం చేశారు. నిన్న అర్ధరాత్రి కూడా ఐదుగురు వ్యక్తులు తాగి వచ్చి వెంకట్ ను కొట్టుకుంటూ లాక్కెళ్లి ఉదయం 6 గంటలకి వదిలి వెళ్లారని అన్నారు,కేస్ నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసత్తున్నారు...

# యూనివర్సిటీ వీసీ దరఖాస్తుల వడపోత

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల పదవీకాలం ముగియనుండటంతో కొత్త వీసీ నియామకం ప్రక్రియ జోరుగా కొనసాగుతుంది. తెలంగాణలోని యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసింది. పది యూనివర్సిటీలకు సంబంధించి వీసీ పోస్టుల కోసం హైయర్ ఎడ్యూకేషన్ కౌన్సిల్ దరఖాస్తులు స్వీకరించింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఉస్మానియా యూనివర్సిటీ,పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్టీయూ, కాకతీయ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించింది ఉన్నతవిద్యా మండలి. అలాగే, శాతవాహన యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీల వీసీల పోస్టులకు దరఖాస్తులుస్వీకరించింది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 12 వరకు అప్లికేషన్లు తీసుకోగా పది విశ్వవిద్యాలయాలకు గానూ 1,382 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల్లో కొంతమంది ఒక్క యూనివర్సిటీ వీసీ కాకుండా, ఏదో ఒక యూనివర్సిటీకి రాకపోతుందా అని, రెండు అంతకుమించి వర్సిటీ వీసీ పోస్టుల కోసం కూడా దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటికి 208 అప్లికేషన్లు రాగా, కనిష్టంగా జేఎన్ఏఎఫ్ఏయూకు 51



దరఖాస్తులు వచ్చాయి. వీసీ దరఖాస్తుల స్వీకరణ ముగియ డంతో వాటి స్క్రూటిని ప్రక్రియను ఉన్నత విద్యా మండలి ప్రారంభించింది. వీటిని వడపోసి ప్రభుత్వానికి నివేదించనుంది. దీనికి అనుగుణంగా వైస్ చాన్సలర్ సెర్చ్ కమిటీ ఏర్పాటుప్రక్రియను కూడా ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల్లో ఎగ్జిక్యూటివ్ కమిటీల సమావేశాలు జరిపి, నామినీల నియామకం పూర్తి చేస్తారు. ఙఉఅ నామినిల కోసం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం లేఖరాశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి నామినిల జాబితా రాగానే ముగ్గురు సభ్యులతో యునివర్సిటీకి ఒక సెర్చ్ కమిటీ నియమిస్తారు. ఆ తర్వాత వీసీ పోస్టుల కోసం వచ్చి దరఖాస్తుల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియస్టార్ట్ అవుతుంది. వైస్ చాన్సలర్లను నియామకాన్ని వేగవంతంగా పూర్తి చేసి విశ్వవిద్యాలయాల్లోని సమస్యలకు చెక్ పెట్టాలని సర్కార్ భావిస్తోంది.

**యూనివర్సిటీల వారీగా వచ్చిన అప్లికేషన్లు:**

| | |
|---|---|
| ఉస్మానియా యూనివర్సిటీ | 193 |
| పాలమూరు యూనివర్సిటీ | 159 |
| మహాత్మాగాంధీ యూనివర్సిటీ | 157 |
| శాతవాహన యూనివర్సిటీ | 158 |
| తెలంగాణ యూనివర్సిటీ | 135 |
| పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ | 66 |
| అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ | 208 |
| జేఎన్‌టీయూ-హైదరాబాద్ | 106 |
| జేఎన్ఏఎఫ్ఏయూ | 51 |

# మిర్చి కాటాలో హైటెక్ మోసం

- రిమోట్‌తో కాటాను నియంత్రిస్తున్న వ్యాపారులు
- పట్టుకొని దేహశుద్ధి చేసిన రైతులు

**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :**
ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్నలకు ఏదో ఒకచోట దగా జరుగుతూనే ఉంది. రాత్రి పగలు కష్టపడి పండించిన మిర్చి పంటలు సరిగా దిగబడి లేక దిగాలు పోయిన రైతన్నలు,పండించిన పంటను అమ్మేందుకు వెళ్లి చివరకు వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. తాజాగా రైతులను మిర్చి కాటా వేస్తూ రైతులను మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. చంద్రుగొండ మండల పరిధిలోని బెండల పాడు గ్రామంలో మిర్చి కాటాను రిమోట్ కంట్రోల్ తో నియంత్రిస్తూ హైటెక్ మోసానికి పాటుపడుతున్న ఇద్దరు వ్యాపారులను రైతులు పట్టుకున్నారు. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యాపారులు గత నాలుగు రోజులుగా మండల పరిధిలోని బెండలపాడు బాలికుంట గ్రామాల్లో మిర్చికి క్వింటకు 19వేల రూపాయలు చెల్లించి రైతులు వద్ద నుండి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో మిర్చి విక్రయించిన రైతులకు వ్యాపారులపై అనుమానం వచ్చింది. రోజు లాగానే గ్రామంలోకి మిర్చి కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యాపారులు ఓ రైతు వద్ద మిర్చి కొనుగోలు చేసి 25.53 క్వింటాలు అయినట్టు రైతుకు రసీదు ఇచ్చి ఆ మిర్చీని ఒక ట్రాలీ ఆటోలో లోడ్ చేసుకొని తరలిస్తున్న క్రమంలో అనుమానం వచ్చిన రైతులు ఆ ట్రాలీ ఆటోను ఓ వే బ్రిడ్జి వద్ద తూకం వేయించగా ఆ తూకంలో 31.10 క్వింటాలు రావడంతో దాదాపు 5 క్వింటాలు పైగా అధికంగా ఉ ఒడటంతో గమనించిన రైతులు వ్యాపారులను నిలదీశారు.

# చందాలకు సుప్రీం చెక్!

**మొదటిపేజీ తరువాయి..**

సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై విచారణ పూర్తయిన సందర్భంగా ఈ తీర్పు వెలువరించింది. ఈ బాండ్స్‌ని విక్రయించకూడదని ఆదేశించింది. విరాళాలిచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచడం తగదని మందలించింది. ఎన్నికల కమిషన్, ౯ఃఎ తమతమ వెబ్‌సైట్‌లలో ఈ వివరాలు పొందుపరచాలని తేల్చి చెప్పింది ధర్మాసనం. పార్టీలకు వచ్చిన నిధులు ఎవరు ఇచ్చారో తెలియాలని వెల్లడించింది. 2018లో జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లు ౯ఞష్ట్రవఎవని తీసుకొచ్చింది. రాజకీయ పార్టీకి కానీ, ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులకు కానీ విరాళాలు అందించాలంటే ఈ బాండ్‌లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ బాండ్‌ల ద్వారానే ఆయా పార్టీలు లేదా వ్యక్తులు విరాళాలు తీసుకోవచ్చు. బ్లాక్ మనీని అడ్డుకునేందుకు ఈ స్కీమ్ తీసుకొచ్చామని కేంద్రం చెప్పినప్పటికీ కొందరు దీన్ని సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. వీటిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఇలా తీర్పునిచ్చింది. 2019 నుంచి ఇప్పటి వరకూ ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా రాజకీయ పార్టీలకు ఎంత మేర విరాళాలు వచ్చాయో లెక్కలన్నీ వెల్లడించాలని ౯ఃఎని సుప్రీంకోర్టు ఆదేశించింది. మార్చి 13వ తేదీలోగా అన్ని వివరాలూ బయట పెట్టాలని స్పష్టం చేసింది. "ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌ని సుప్రీంకోర్టు నిలిపివేసింది. అందులోని అన్ని ప్రొవిజన్స్‌ని పక్కన పెట్టేసింది. ఈ పథకం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కోర్టు భావించింది. రాజకీయ పార్టీలకు ఎవరు విరాళాలు ఇస్తున్నారన్న కనీస సమాచారం ప్రజలకు తెలియాల్సిన అవసరముంది. అది వాళ్ల హక్కు. అపరిమిత విరాళాలనూ నిలిపివేయాలని ఆదేశించింది" ఎలక్టోరల్ బాండ్స్‌ను వెంటనే నిలిపివేయాలని.. వాటిని అమ్మకూడదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2019 నుంచి ఇప్పటిదాకా జారీ చేసిన ఎలక్టోరల్ బాండ్స్ వివరాలను మూడు వారాల్లో(మార్చి 6వ తేదీలోగా) కేంద్ర ఎన్నికల సంఘానికి అందించాలని ఎస్బీఐని సుప్రీం ఆదేశించింది. అలాగే ఆ వివరాలను బహిర్గత పర్చాల్సిన అవసరం ఉందని.. ఎలక్టోరల్ బాండ్స్ ఏ రాజకీయ పార్టీకి ఎంత వచ్చాయన్న వివరాలు మార్చి 13వ తేదీ లోగా తన వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీం ఆదేశించింది. మరోవైపు.. 2019 నుంచి ఇప్పటిదాకా ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో తీసుకున్న విరాళాలను మొత్తం వెనక్కి ఇచ్చేయాల్సిందేనని రాజకీయ పార్టీలకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం రాజకీయ పార్టీలకు 15 రోజుల గడువు ఇచ్చింది. రాజకీయ పార్టీలకు అందే నిధుల్లో పారదర్శకత తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2018 జనవరి 2న అమల్లోకి తెచ్చింది. ఈ పథకాన్ని సవాల్ చేస్తూ ఏడీఆర్, కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్, సీపీఎం, మరో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల బాండ్లను ప్రారంభించడానికి ముందే ఈ పథకంపై సమగ్ర విచారణ అవసరమని అక్టోబరు 10న సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్(ఏడీఆర్ తరఫున) చేసిన విజ్ఞప్తిని



సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. దీంతో కిందటి ఏడాది అక్టోబర్ 31న వాదనలు ప్రారంభమయ్యాయి. ఈ పిటిషన్లపై మూడు రోజులపాటు విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం.. నవంబర్ 2వ తేదీన తీర్పు రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కానిస్టిట్యూషన్ బెంచ్‌లో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఈ ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. అదే సమయంలో.. సీల్డ్ కవర్‌లో 2023 సెప్టెంబర్ 30 వరకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు అందిన నిధుల వివరాలు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది కూడా. ఎన్నికల బాండ్లు ఒక ప్రామిసరీ నోట్ లాంటివి. ఇవి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(౯ఃఎ)లో లభ్యం అవుతాయి. వ్యక్తులు, కంపెనీలు వీటిని కొనుగోలు చేయవచ్చు. అలా కొనుగోలు చేసిన వాటిని నచ్చిన రాజకీయ పార్టీలకు విరాళంగా ఇవ్వొచ్చు. రాజకీయ పార్టీలు తమకు వచ్చిన బాండ్లను నగదుగా మార్చుకొని పార్టీ కార్యక్రమాల కోసం వినియోగించుకుంటాయి. రాజకీయ పార్టీల విరాళాల విషయంలో పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వం 2018లో ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే, రాజకీయ పార్టీలు తాము స్వీకరించిన విరాళాల గురించి బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చట్టం–2017 సవరణ చేసింది. దాంతో ఎన్నికల బాండ్ల విధానంలో పారదర్శకత లోపించిందని పలువురు విమర్శించారు. ఈ క్రమంలోనే ఈ పథకాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి.

కేంద్రం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం పారదర్శకత కొరవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేస్తోంది. అధికారప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలను కల్పించకపోగా అవినీతిని ప్రోత్సహిస్తోంది

ఎన్నికల బాండ్ల ద్వారా ఇప్పటి వరకూ సమకూరిన నిధుల్లో అత్యధిక భాగం కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకే వెళ్లాయి. విపక్ష పార్టీలకు స్వల్ప మొత్తంలోనే విరాళాలు వచ్చాయి. ఈ మేరకు గణాంకాలతో సహా వివరించారు సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్ . ప్రపంచంలోని అనేక దేశాలు ఎన్నికల్లో నల్లధనం ప్రభావాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. మన దేశంలో నల్లధనాన్ని అరికట్టడానికి డిజిటల్ చెల్లింపుల విధానం అమలు, 2.38 లక్షల డొల్ల కంపెనీలపై చర్యలు వంటివి కేంద్రం తీసుకుంది. స్వచ్ఛమైన డబ్బే రాజకీయ పార్టీలకు విరాళాలుగా అందేలా చేయడానికి ఎన్నికల బాండ్ల పథకం రూపంలో కేంద్రం మరో ప్రయత్నం చేసింది. ఒక దశలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ జోక్యం చేసుకుంటూ..."అధికార పార్టీకే అధిక విరాళాలు ఎందుకు వెళ్తున్నాయి. దీనికి కారణమేమిటి" అని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల ద్వారా సమకూరిన మొత్తం నిధులను ఎన్నికల సంఘం వద్ద ఉంచి, దాని ద్వారా అన్ని పార్టీలకు సమానంగా పంపిణీ చేయవచ్చు కదా అని ఆయన సూచించారు.కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిస్తూ....'అప్పుడు అసలు విరాళాలే రావ'ని అభిప్రాయపడ్డారు. అంతకుముందు ఈ పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. ఎన్నికల బాండ్ల నిధుల మూలాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే హక్కు దేశ పౌరులకు లేదని అందులో పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం లక్ష్య సాధనలో కొన్ని సమస్యలున్నాయి గోప్యత, విశ్వసనీయత కొందరికే పరిమితవవుతోంది ఎస్‌బీఐ వద్ద ఉన్న వివరాలను దర్యాప్తు సంస్థల ద్వారా ఏ రాజకీయ పార్టీకి, ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది అధికారంలో ఉన్న వారు తెలుసుకోగలరు. అదే విపక్షంలో ఉన్న వారికి అటువంటి అవకాశం లేదు. అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించలేనప్పుడు పథకం నిష్పాక్షికత, పారదర్శకత ప్రశ్నార్థకమవుతుంది. రాజకీయ అభ్యంతరాలుఅసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరం మధ్య ఎలక్టోరల్ బాండ్ల రూపంలో భారతీయ జనతా పార్టీకి రూ.5,127.97 కోట్ల మేర విరాళాలు వచ్చాయి. మిగతా అన్ని జాతీయ పార్టీలకు కలిసి కేవలం రూ.1,783.93 కోట్లు మాత్రమే వచ్చాయి. దీని ప్రకారం ఎలక్టోరల్ బాండ్లతో అధికార పార్టీకి ఎంతమేర ప్రయోజనం కలుగుతుందో అర్థం చేసుకోవచ్చని విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## నగల షాపులో దోపిడి



**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు :** మలక్ పేట అక్బర్ బాగ్ లోని కిశ్వ జ్యూవెలరీ లో భారీ చోరి చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్ పై వచ్చారు., అక్బర్ బాగ్ చౌరస్తాలో ఉన్న కిశ్వా జ్యువెలర్స్ షాప్ లోకి వెళ్లి, షాప్ లో ఉన్నటువంటి సజావుర్ రెహమాన్ పై కత్తితో దాడి చేశారు., షాప్ లో బంగారు ఆభరణాలు ఎత్తుకొని పారి పోయారు. ఈ దాడి లో వ్యాపారికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చోరి ఎంత మేరకు జరిగిందని పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు ఈస్ట్ జోన్ డీసీపీ జానకి దారవత్. క్లూస్ టీన్ సందర్శించారు.

# సంపాదకీయమ్..

## బతకడం నేర్పించే విద్య కావాలి

మనదేశంలో విద్యా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఎంత డబ్బు పెడితే అంత చదువు కొనుక్కోవచ్చనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉన్నారు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువుల కోసం ఆస్తులు తెగనమ్మి కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. వ్యాపారాత్మకమైన విద్యలో విలువలకు చోటు లేకుండా పోయింది. మార్కులు, ర్యాంకులకే ప్రాధాన్యత ఉంది. కానీ అమెరికా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం చాలా బాగుంటుంది. పూర్తిగా ఉచితం కావడం, విద్యా ప్రమాణాలు బాగుండటంతో ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. అమెరికాలో పారిశ్రామిక విప్లవం అనంతరం అనేక రంగాల్లో బాగా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా విద్యారంగంలో ఆ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మార్పులే ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఎదగడానికి దోహదపడ్డాయి. అమెరికా మొత్తం బడ్జెట్‌లో విద్యకు సుమారు 8.5 శాతం అంటే 90 బిలియన్ డాలర్లకు పైగా వెచ్చిస్తున్నారు. అమెరికాలో కిండర్ గార్డెన్ నుంచి 5వ తరగతి వరకు ఎలిమెంటరీ స్కూల్ పేరుతో పిలుస్తారు. 6, 7, 8 తరగతులను మిడిల్ స్కూల్ అని.. 9, 10, 11, 12 తరగతులను హైస్కూల్ అని అంటారు. హైస్కూల్ చదువు వరకు ప్రభుత్వం ఉచిత విద్యను అందజేస్తుంది. తర్వాత కాలేజీ విద్య కొనసాగింపు చాలా ఖరీదైన వ్యవహారం బాగా మార్కులు తెచ్చుకోగలిగితే స్కాలర్ షిప్‌ల రూపంలో ఆర్థిక వనరులు సమకూరుస్తారు. మిషనరీ స్కూల్స్ కూడా ఉంటాయి, అలాగే రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలో కమ్యూనిటీ కాలేజీలు ఉన్నాయి. ఇక్కడ మాత్రం నామమాత్రపు ఫీజులుంటాయి. ఒక్కో క్లాస్‌కు 25 నుంచి 30 మంది వరకు విద్యార్థులు ఉంటారు. అమెరికాలో బాలబాలికలిద్దరూ కలిసే చదువుకుంటారు. అందరూ కలిసి భోజనం చేసేందుకు పెద్ద డైనింగ్ హాల్ ఉంటుంది. ఇక్కడ పేద పిల్లలకు ఉచితంగా ఆహారం అందజేస్తారు. మిగిలిన వారు నగదు చెల్లించాల్సి ఉంటుంది. మంచి ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందజేస్తారు. అన్ని ప్రాంతాలకు ఉచిత బస్సు సౌకర్యం ఉంటుంది. తల్లిదండ్రులు, టీచర్లు, పిల్లలను అనుసంధానం చేస్తూ ఒక యాప్ ఉంటుంది. అందులో విద్యార్థి హాజరు, మార్కులు, ప్రవర్తనా తీరులాంటి అనేక అంశాలు పొందుపరుస్తారు. ఒక జాతిని సామాజికంగా, ఆర్థికంగా నడిపించే శక్తి విజ్ఞానానికి, నైపుణ్యానికి మాత్రమే ఉందన్న వాస్తవాన్ని గ్రహించిన అమెరికా ఆ దిశగా పయనించింది. అమెరికాలోని డేకేర్స్, ప్రైవేటు పాఠశాలల్లో భారీ ఫీజులుంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం చాలా అందమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, అత్యంత సౌకర్యవంతంగా ఉంటాయి. ఆయా స్కూల్స్‌లో ఉన్న విద్యాప్రమాణాలు, విద్యా బోధన, ఇతర సౌకర్యాలు ఆధారంగా వాటికి ఒకటి నుంచి పది పాయింట్ల వరకు రేటింగ్ ఇస్తారు. ఏ ప్రాంతంలో నివసిస్తున్న వారు ఆ ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లోనే చేర్పించాలి. ఇక్కడ విలువలతో కూడిన విద్య, నైపుణ్యం సంపాదించి బతకడం నేర్పిస్తారు. పిల్లలు కూడా ఇష్టంగా స్కూళ్లకు వెళతారు. కానీ మన పాఠశాలల్లో పిల్లలను వాస్తవ ప్రపంచానికి దూరంగా పెంచుతున్నాం. పుస్తక ప్రపంచంలో ఉంచి బట్టీ చదువులకు అలవాటు చేస్తున్నాం. బడికి ఎప్పుడైనా వెళ్లి చదువుకోవచ్చు, కానీ మంచి పౌరుడిగా ఎదగడానికి పసి వయసులోనే బీజం పడాలి. కానీ ఆ కోణంలో ఆలోచించలేకపోతున్నాం. బడ్జెట్ లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం బడ్జెట్ లో 2.5 శాతం.. అంటే లక్షా 12 వేల కోట్లు కేటాయించారు. ఆ నిధుల్లో కూడా ఎక్కువ భాగం సద్వినియోగం కావడం లేదు. మార్కులే కొలమానంగా భావిస్తూ, వాటి సాధనే జీవిత లక్ష్యంగా బోధిస్తున్నారు. అంతిమంగా పరీక్షల్లో సంపాదించే మార్కులనే మనం విద్యకు ప్రామాణికంగా తీసుకోవడంతో పిల్లలపై మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దీంతో పొరపాటున పరీక్షల్లో తప్పితే జీవితమంతా వ్యర్థమైనట్లు, ఓడిపోయినట్లుగా భావిస్తున్నారు. వీటివల్ల వారిలో ఆత్మనూన్యతాభావం పెరిగి మానసిక క్షోభతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. భారతీయుల్లో సహజంగా ఉండే కష్టపడే గుణం, నేర్చుకునే తపన, పోటీతత్వం తదితర కారణాలతో వారు బాగా రాణిస్తూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. కరోనా సమయంలో ఆన్ లైన్ విద్యావిధానానికి గిరాకీ పెరిగింది. మనదేశంలో ఉన్న విద్యావంతులు దీనిని అవకాశంగా మలచుకుని అనేక దేశాల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. అమెరికాలో పౌరసత్వం ఉన్న భారతీయులు సైతం ఇక్కడి స్కూళ్లలోని విశృంఖలత్వం, నేరప్రవృత్తి, కట్టుబాట్లు లేని సాంప్రదాయాలతో తమ పిల్లలు ఎక్కడ చెడిపోతారోనని భయపడుతున్నారు. దీంతో మాతృదేశంలోని స్కూళ్లలో చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇటీవల కాలంలో అది పెరిగిపోయింది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ఎక్కువ మార్కులు, ర్యాంకులు సాధించడం కంటే నైతిక విలువలు, సృజనాత్మకతతో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలు వర్తమానంలో జీవించడానికి అలవాటు చేయాలి. వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో ఆయా రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి. పిల్లల ఆసక్తిని గమనించకుండా తల్లిదండ్రుల ఇష్టాఇష్టాలను వారిపై రుద్దే ప్రయత్నం చేయకూడదు. పిల్లలను ఇతరులతో పోల్చడం, వారిని పదేపదే విమర్శించడం వల్ల వారిలో ఆత్మనూన్యతా భావం పెరిగి తోటి విద్యార్థుల పట్ల ద్వేషం పెరుగుతుంది. విద్యాబోధన అంటే కేవలం సంపాదన అనే దృక్పథంతో చూడకూడదు. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా ఉండాలి. ఆత్మవిశ్వాసాన్ని, జ్ఞాపక శక్తిని, సామాజిక స్పృహను పెంచడం ద్వారా వారిలో చదువుల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

## 12 మంది.. ఒక్క చాన్స్ ప్లీజ్

మొదటిపేజీ తరువాయి..

వెనుకాడలేదు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాస్ రెడ్డి, నాగ సీతారాములు, వక్కలగడ్డసోమ చంద్రశేఖర్, వక్కలగడ్డ రూప ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. ఒక్క స్థానం కోసం 12 మంది పోటాపోటీ గా దరఖాస్తు చేసుకున్న పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. రాష్ట్రంలోవేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితులు ఖమ్మం ఎంపీ టిక్కెట్ స్థాయిని అమాంతం పెంచేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాల్లో తొమ్మిదింటిలో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించడమే ఇందుకుకారణంగా స్పష్టమవుతోంది. మొత్తం 12 దరఖాస్తుల్లో ఆరింటిని పక్కన పెట్టేసి మిగిలిన ఆరు దరఖాస్తుల్లో అభ్యర్థిని ఎంపిక చేసే విషయాన్ని పరిశీలించాలని జిల్లా కాంగ్రెస్ నుంచి సూచనప్రాయ సందేశం అధిష్టానానికివెళ్లినట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ మహా ప్రభంజనమే సృష్టించింది. ఈ నియోజక వర్గాల్లో అందరు అభ్యర్థులు పాతిక వేల పైచిలుకు మెజారిటీతోనే విజయం సాధించారు. దీంతో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ సీటు ఎవరికి దక్కినా వారు గెలవడం నల్లేరుపై నడకే కానుంది. ఖమ్మం కాంగ్రెస్ లో టిక్కెట్ కోసం పోటాపోటీ నెలకొనగా బీఆర్ఎస్ లో ఇందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ఎలాగూ గట్టెక్కే పరిస్థితి లేని నేపథ్యంలో గులాబీ పార్టీలో ఆశావహులు కాదు కదా అసలు సిట్టింగ్ అభ్యర్థే పోటీ చేసేందుకు అనాశక్తి చూపుతున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా నామా నాగేశ్వరరావు తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి రేణుకా చౌదరిపై విజయం సాధించారు. అయితే తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మంలో కాంగ్రెస్ గాలి బలంగావీచిన క్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందడం ఆషామాషీ విషయం కాదు.

# ఆపరేషన్ ఆకర్ష్‌కు గ్రీన్ సిగ్నల్...

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ కాంగ్రెస్ గేట్లెత్తిందా? ఆపరేషన్ ఆకర్ష్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందా? అంటే.. అవుననే అంటున్నాయి జరుగుతున్న పరిణామాలు. వివిధ కారణాలతో బయటకు వెళ్లిపోయిన పాత నాయకులను తిరిగిరప్పించడంపై అధి నాయకత్వం సీరియస్‌గా దృష్టిపెట్టినట్టు చెబుతున్నాయి పార్టీ వర్గాలు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు.. రాజకీయ ప్రత్యర్థులపై పంజా గట్టిగానే విసరాలని సీఎం డిసైడైనట్టు ప్రచారం జరుగుతోంది. దాని చుట్టూనే ఇప్పుడు పార్టీలో చర్చ జరుగుతోంది. ఢిల్లీ టూర్‌లో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతకు పార్టీ ప్రధాన కారుదర్శి కేసీ వేణుగోపాల్ తో కండువా కప్పించారు సీఎం రేవంత్‌రెడ్డి. అదే సమయంలో మన్నే జీవన్ రెడ్డికూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మహబూబ్ నగర్ ఎంపీ టిక్కెట్ కోసం ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం. ఈ పరిణామాన్ని .. ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపినట్టుగానే చూడాలంటున్నాయి రాజకీయవర్గాలు.

ఈసారి ఎట్టి పరిస్థితుల్లో 12 ఎంపీ సీట్లు గెలవాలన్న కసిగా ఉంది తెలంగాణ కాంగ్రెస్. సీఎంగా రేవంత్‌రెడ్డి ఎదుర్కోబోతున్న తొలి ఎన్నిక కావడంతో ఆయనకు కూడా ఇది సవాల్‌గా మారిందట. రాష్ట్రంలోఅధికారంలోకి రావడం ఒక ఎత్తయితే? వచ్చిన అధికార బలంతో పార్టీకి ఎక్కువ ఎంపీ సీట్లు గెలిపించి ఇవ్వడమన్నది మరో ఎత్తుగా భావిస్తున్నాయి రాజకీయవర్గాలు. సీఎంకి ఇది మేజర్ టాస్క్ కాబట్టి చేరికలు ఇంకాపెరిగే అవకాశం ఉందంటున్నారు. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి నాయకులు కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్నట్టు



స్పష్టం చేస్తున్నాయి తాజా పరిణామాలు. వెంకటేష్ నేతతో పాటు.. బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న మర్రిజనార్దన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ రాములు కూడా కాంగ్రెస్‌కు క్యూలో ఉన్నారనే టాక్ మొదలయింది.

అలాగే మాజీ మంత్రి రాజయ్య కూడా గులాబీ కండువా తీసు పక్కన పెట్టేశారు. ఇప్పుడాయన మూడు రంగుల కండువా కప్పుకోవడం ఎప్పుడన్నది మాత్రమే తేలాల్సి ఉంది. ఇక, రంగారెడ్డి జిల్లా నుంచి మాజీ మంత్రి మహేందర్ రెడ్డి కూడా పార్టీ మారతారన్న ప్రచారం ఉంది. మరో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి మీద కూడా రూమర్స్‌నడుస్తున్నాయి. రంజిత్ రెడ్డి కారు దిగేయడానికి సిద్ధంగా ఉన్నారన్న ప్రచారం గట్టిగానే జరుగుతోంది. ఎంపీతోపాటు ఆయనకు సన్నిహితంగా ఉండే మరో నేత కూడా కాంగ్రెస్ గూటికి చేరతారన్న చర్చ జరుగుతోందిరాజకీయవర్గాల్లో. మొత్తంగా ప్రస్తుత వాతావరణాన్ని చూస్తుంటే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు భారీగానే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు పరిశీలకులు. మరి కొందరు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో కూడాఉన్నట్టు తెలుస్తోంది. మరి గులాబీ రేకులు ఎన్ని రాలిపోతాయో, అలా రాలకుండా పార్టీ అధిష్టానం ఏం ట్రీట్‌మెంట్ ఇస్తుందో చూడాలి.

## నంబర్ 2 హరీష్..!

మొదటిపేజీ తరువాయి..

జరిగిన అవినీతిని ప్రజల ముందు పెట్టడంలో రేవంత్ అండ్ కో సఫలమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తుండటంతో..ప్రతిపక్ష పార్టీ కొత్త వాదన తెరపైకి తెచ్చింది. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనెజ్ మెంట్ బోర్డుకు (కేఆర్ఎంబీ) అప్పగించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తప్పుపట్టింది. కాంగ్రెస్ హయాంలో తెలంగాణకు నీటి పంపకాల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. అయితే, ఆ పాపమంతా మాజీ సీఎం కేసీఆర్‌దేనని కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో కృష్ణానది ప్రాజెక్టులు, కేఆర్ఎంబీ సంబంధిత అంశాలపై చర్చజరిగింది. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలు గత బీఆర్ ఎస్ ప్రభుత్వంలోనే తెలంగాణకు నీటివాటాను సాధించుకోవటంలో అన్యాయంజరిగిందని తీవ్ర సాయిలో మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఆంధ్రాకు అప్పగించారంటూ విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ఆయనఆధ్వర్యంలో జరిగిన అవినీతి బయటపడుతుందనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని కాంగ్రెస్ సభ్యులు అన్నారు. అయితే, అసెంబ్లీలో బీఆర్ ఎస్ తరపున హరీష్ రావు మాత్రమే అధికార పక్షానికి సమాధానం ఇచ్చేప్రయత్నం చేశారు. నీటి వాటాపై చర్చ ప్రారంభమైన సమయం నుంచి హరీష్ రావు, ఇద్దరు ముగ్గురు బీఆర్ ఎస్ సభ్యులు మాత్రమే కాంగ్రెస్ సభ్యుల వాదనలకు బదులిచ్చే ప్రయత్నం చేశారు. కేటీఆర్ సభలోఉన్నప్పటికీ కేవలం బ్యాక్ బెంచ్ కే పరిమితం అయ్యారు. కేసీఆర్ పై కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతున్నా.. కేటీఆర్ కౌంటర్ ఇచ్చేందుకు ఏమాత్రం ప్రయత్నం చేయకపోవటం బీఆర్ ఎస్ శ్రేణులకు ఇబ్బందికరంగా మారింది. బీఆర్ ఎస్ లో కేసీఆర్ తరువాత ఆయన తనయుడు కేటీఆరే అధ్యక్షుడిగా ఉంటాడని, మళ్లీ బీఆర్ ఎస్ అధికారంలోకి వస్తే సీఎం కాబోయేది కేటీఆరేనని బీఆర్ ఎస్ నేతలు చెబుతుంటాడు. కేటీఆర్ అభిమానులైతే అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సరియైన సమాధానం చెప్పేది ఒక్క కేటీఆరేనని గొప్పలు చెప్పుకోవటం చూస్తూనే ఉంటాం. అంతే కాకుండా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ కేసీఆర్ ఆబ్సెన్స్ లో గట్టిగామాట్లాడాల్సి ఉంది. అయితే కేటీఆర్ రాష్ట్రంలో అతిముఖ్యమైన ప్రాజెక్టులు, కృష్ణా జలాల నీటి పంపకం వంటి అంశాలపై అసెంబ్లీలో చర్చజరుగుతుంటే కేటీఆర్ మాత్రం అసెంబ్లీలో వెనుక సీట్లలో కూర్చొని రిలాక్స్ అవ్వడం బీఆర్ ఎస్ శ్రేణులకు మింగుడు పడని అంశంగా మారింది. ప్రాజెక్టుల అంశంపై చర్చ కాబట్టి.. గత ప్రభుత్వంలో ఆ శాఖకు మంత్రిగా హరీష్‌రావు ఉండటం వల్ల.. హరీష్ రావే అధికార పక్షం వాదనలకు సమాధా నం చెప్పారని పలువురు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నప్పటికీ.. కేసీఆర్ తరువాత



నేనే అని చెప్పుకునే కేటీఆర్ కు అన్ని అంశాలపై అవగాహన ఉండాలని, అన్ని విషయాల్లో ముందుండి అధికార పక్షం వాదనలను తిప్పికొట్టాలని, కానీ, పార్టీ కష్టకాలంలో నాయకుడిగా ముందుండి నడిపే లక్షణాలు కేటీఆర్‌లో లేవని పలువురు బీఆర్ ఎస్ నేతలు పేర్కొంటుండటం గమనార్హం. మరోవైపు.. అసెంబ్లీ సమావేశం ముగిసిన తరువాత కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు.. ఆ ట్వీట్‌లో.. శాసనసభలో ఇవ్వాళ తమ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు ఒంటిచేత్తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులను ఎదుర్కొన్నారని ప్రశంసించారు. దీనికితోడు.. బీఆర్ఎస్ లో కేసీఆర్ తరువాత కేటీఆరే నెంబర్-2 అనుకుంటున్న కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు.. అసెంబ్లీలో హరీష్ రావు దూకుడు చూసిన తరువాత కేసీఆర్ తరువాత హరీశ్ రావే నెంబర్-2గా అర్హుడనే విషయాన్ని తెరపైకితెస్తున్నారు. కేసీఆర్ తరువాత నెం.2 ఎవరు అనే అంశంపై బీఆర్ ఎస్ లో కొన్నేళ్లుగా చర్చ జరుగుతుంది. అధికశాతం మంది బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలుసైతం కేటీఆరే నెం.2 అని పేర్కొంటూ వచ్చారు. ప్రస్తుతం, బీఆర్ ఎస్ అధికారం కోల్పోవడంతో.. కేటీఆర్ అసెంబ్లీలోనూ, బయట అధికార పక్షానికి గట్టి కౌంటర్ ఇవ్వలేక పోతున్నారు. ఇదే సమయంలో హరీష్ రావు దూకుడు పెంచడంతోపాటు,అన్ని అంశాల్లోనూ అసెంబ్లీలో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో.. కేటీఆర్ వర్గీయులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులుసైతం ఎప్పటికైనా బీఆర్ ఎస్ కు నెం.2 హరీష్ రావేనన్న అభిప్రాయానికి వస్తున్నారట. కేటీఆర్ రాబోయే రోజుల్లోనూ.. ఇది నా అంశం కాదులే.. గతంలో ఇది నా శాఖ కాదులే.. నేను మాట్లాడటం ఎందుకని అసెంబ్లీలో బ్యాక్ బెంచీకి పరిమితం అయితే.. పార్టీలోనూ బ్యాక్ బెంచ్ కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని కేటీఆర్ అభిమానులు ఆందోళన చెందుతున్నారట.

## ఎందుకు రాలే..?

మొదటిపేజీ తరువాయి..

గెలిచిన తర్వాత ఇప్పటికి రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. తొలి సమావేశానికి గానీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉమ్మడి సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళి సై చేసిన ప్రసంగానికి దూరంగానే ఉన్నారు. మధ్యలో ఒకరోజు వచ్చి స్పీకర్ ఛాంబర్ లో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి వెళ్లారు తప్ప అసెంబ్లీ వైపు రాలేదు. "తెలంగాణ సమాజానికి నీళ్లు ప్రాణప్రాయం. కృష్ణా నదీ జలాలలపై ఐదారు జిల్లాలు ఆధారపడి బతుకుతున్నాయి. చర్చ జరుగుతున్నప్పుడు ఆ మహానుభావుడు ఫాంహౌస్ లో ఎందుకు దాక్కున్నాడు. ఇలా చేయడమంటే తెలంగాణ ప్రజల్ని అవమానించడమే. కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు ఆ పెద్దమనిషి సభకు రావాల్నా, లేదా. సభకు రాకుండా ఫాంహౌస్‌లో దాక్కుని తప్పించుకోవాలంటే ఎలా" అని అసెంబ్లీలో ప్రశ్నించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తెలంగాణ ఉద్యమం పుట్టిందే నీళ్లు, నిధులు, నియామకాలపైన. అటువంటిది కృష్ణా నది జలాలపై నిర్మించిన ప్రాజెక్టులపై ఆధారపడి ఐదారు జిల్లాలు జీవనం సాగిస్తున్నాయి. అటువంటి ప్రాజెక్టులపై చర్చ సాగుతున్నప్పుడు కేసీఆర్ సభకు వచ్చి చర్చలో పాల్గొని సరైన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు తామంతా ఒకేతాటిపై ఉన్నామనే సంకేతం ఇస్తే బాగుండేదని, కానీ కేసీఆర్ ఆ పని చేయలేదని భావిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలు.. ఎక్కువగా వ్యక్తుల ప్రాతిపదికగా లేదంటే కుటుంబాల నాయకత్వంలోనే నడుస్తుంటాయి. దానికి మిగతా వాళ్లు కట్టుబడి ఉండాలని రూల్ లేకపోయినా అంత:సూత్రం మాత్రం అలాగే ఉంటుంది. అసెంబ్లీకి ఎందుకు రాలేదు అని ఎవరైనా అడిగితే ఏ వైపు నుంచి సమాధానం రాదు. హరీశ్ రావు చెప్పింది కూడా అలాగే ఉంది. సభకు ఎందుకు రాలేదో చెప్పలేదు గాని 'కాంగ్రెస్ వాళ్లు కేసీఆర్ ని అనేంత మాత్రపు వాళ్లా' అని ఎదురుదాడి చేశారు. రేవంత్ రెడ్డితో కేసీఆర్ రాజకీయ వైరం గురించి చెప్పాల్సిన పని లేదు. రేవంత్ పేరును కూడా ఆయన ప్రస్తావించే వారు కాదు. ఇప్పుడు అదే వ్యక్తి సీఎం కావడం, తాను కూర్చున్న కుర్చీలో కూర్చొని ఆదేశాలు ఇవ్వడంపై కేసీఆర్ జీర్ణించుకోలేక పోవచ్చునని అంచనావేస్తున్నారు. రేవంత్ రెడ్డికి గతంలో అసెంబ్లీలో చాలా సార్లు అవమానాలు జరిగాయి. అలాంటి అవమా నాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కేసీఆర్ వెనుకడుగు వేస్తున్నారన్న అంచనాలు కూడా ఉన్నాయి. అయితే కేసీఆర్ పట్ల కాంగ్రెస్ కానీ.. రేవంత్ కానీ అవమానకరంగా వ్యవహరిస్తే అది ప్రజల్లో ఆయనపై సానుభూతి పెరగడానికి కారణం అవుతుంది. అందుకే కాంగ్రెస్ అలాంటి ప్రయత్నం చేయకపోవచ్చునని.. కానీ పాలనలో లోపాలను మాత్రం గట్టిగా ప్రశ్నించే అవకాశం ఉంది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215